కంకర వేశారు.. బీటీ మరిచారు

- అధ్వానంగా మరమ్మతు పనులు
- ఎక్కడికక్కడే గుంతలు
- పట్టించుకోని అధికారులు



అంబారావుగూడ వద్ద తేలిన కంకర

కెరమెరి: రోడ్ల మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం లక్షల రూపాలయాలు నిధులు విడుదల చేస్తున్నా.. కాంట్రాక్టర్లు తమకు ఇష్టం వచ్చిన విధంగా పనులు చేసే చేతులు దులుపుకుంటున్నారు. ఎప్పటికప్పుడు క్వాలిటీ కంట్రోల్ అధికారులు నాణ్యతను పర్యవేక్షించాల్సిన అధికారులు కనీసం చర్యలు తీసుకోవడం లేదు. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత కొన్నేళ్లుగా ఈ తతంగం సాగుతున్నా.. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో తూతూ మంత్రంగా పనులు చేపడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

అడుగడుగునా గుంతలు..

ఆసిఫాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారికి అడుగడుగున గుంతలు పడి ఉన్నాయి. కెరమెరి వరకు సుమారు 30 కిలో మీటర్ల దూరం ఉంది. గతేడాది అంబారావుగూడ, కొశారి ప్రాంతాల్లో బీటీ రోడ్డు వేస్తామని ప్రధాన రోడ్డుకుపై పుతలను తొలగించి ఏడాదికి పైగా గడుస్తున్నా.. ఇంకా బీటీ వేయలేదు. ఫలితంగా రాళ్లు తేలి నడిచేందుకు వీలు లేకుండా పోయింది. వాస్తవంగా ఎక్కడ గంతలు ఉన్నాయో అక్కడ బీటీ వేసి గుంతలకు మరమ్మతులు చేయాల్సి ఉండగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. కొన్ని చోట్ల మాత్రమే మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో వాహనాదారులు ఇబ్బంది పడుతున్నారు. కాగా ఎక్కడైతే కంకర పూర్తిగా లేచి ఉందో వాహనాలు వచ్చినప్పుడల్లా దమ్ము లేస్తోంది. నాలుగు వరుసల రహదారి అవుతుందని ఏడాది నుంచి ప్రచారం జరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీరోడ్డు నిర్మించాలని ప్రజలు కోరతున్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..



కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల కెరమెరి రోడ్డుకు మరమ్మతు పనులు తూతూ మంత్రంగా కొనసాగుతున్నాయి. అధికారులకు పట్టింపులేని తనం వల్ల నేటికీ గుంతలు అలాగే ఉన్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇష్టం వచ్చిన చోట మరమ్మతులు చేసి కాంట్రాక్టర్లు చేతులు దులుపుకున్నారు. గంతలను తక్షణమే పూడ్చాలి

– సుజాయత్ ఖాన్, మానవహక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు

అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో గౌరీ శంకర్



మాట్లాడుతున్న ఎంపీడీవో అల్బర్ట్

బెజ్జూర్: గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎంపీడీవో గౌరీశంకర్ అన్నారు. గురువారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకలతో సమావేశం నిర్వహించారు. వార్డుల వారీగా బూత్‌ల వివరాలు, పోలింగ్ కేంద్రాలను వివరించారు. జాబితాను ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించడం జరిగిందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు జాడి దిగంబర్, వసీఉల్లా ఖాన్, కుమ్మరి తిరుపతి, మె స్రం రాజారాం, సిడాం సంతోష్, బెనికి శ్యాంసుందర్, మెరుగు బాపు, పొన్న ప్రవీణ్, శ్యామల తిరుపతి, ఇందిరిగాం తిరుపతి, కాంగ్రెస్ నాయకులు రాజారాం, హకీమ్, శంకర్, సూర్ల ఇస్తారి, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో సమావేశం

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అన్ని రాజ కీయ పార్టీల అధ్యక్షులతో ఎంపీడీవో అల్బర్ట్ సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీల ఎన్నికలను నిర్వహించేందుకు మండలంలో ఏర్పాటు చేసిన 102 పోలింగ్ కేంద్రాల వివరాలను తెలియచేశారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అధ్యక్షుడు బొయిరే బండు, జనుగరి మధుకర్, బిట్టి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'చలో ఉట్నూర్' విజయవంతం చేయండి



గిరిజనులతో సమావేశమైన నాయకులు

తాంసి: ఈనెల 16న చేపట్టిన చలో ఉట్నూర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయ్యాలని కొలాం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టేకం దిలీప్ కోరారు. గురువారం మండలంలోని ఆయా జల్‌కోరి, కరన్ వాడీ గ్రామాల్లో గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఐటీడీఏ కార్యాలయ ముట్టడికి ప్రతిఒక్కరూ తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కొలాం సంఘం మండల అధ్యక్షుడు ఆత్రం జైదేవ్, నాయకులు మడావి అనిల్, రామారావు, విశాల్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహాసభలను విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కెరమెరి: ఈనెల 14, 15 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లాలో నిర్వహించే మానవహక్కుల వేదిక మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ సుజాయత్ ఖాన్ కోరారు. గురువారం మండల కేంద్రంలో మహాసభ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో జరిగే పరిణామాలపై చర్చించడం జరుగుతుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు సిడాం తిరుపతి, ఆత్రం మారుతి, చహకటి మారు, మంగం భీంరావు, ఆత్రం రాము, కుమురం దేవేందర్ పాల్గొన్నారు.

పశువుల వాహనం పట్టివేత



పట్టుకున్న పశువుల వాహనం

వాంకిడి: మహారాష్ట్ర నుంచి నిజామాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న పశువుల వాహనాన్ని గురువారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఎన్‌హెచ్– 363పై లంజన్వీర ఎక్స్ రోడ్ సమీపంలో తనిఖీలు చేయగా.. ఎంహెచ్33టీ బొలేరా వాహనంలో ఎలాంటి పత్రాలు లేకుండా 7 పశువులను తరలిస్తున్నట్లు గుర్తించారు. పశువులు తరలిస్తున్న మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా గడ్‌చాందూర్‌కు చెందిన షేక్ ఇస్మైల్, గుగూస్‌కు చెందిన షేక్ అమీర్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. పశువులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఘనంగా గీతా జయంతి



ప్రవచనాలు బోధిస్తున్న గురువులు

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి ఓంకార ఆశ్రమంలో గీతా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెండు రోజులుగా నిర్వహిస్తున్న వేడుకలు గురువారం ముగి శాయి. ఆశ్రమంలో రాధా క్రిష్ణుల దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. విద్యుత్‌దీపాలతో భగవద్గీత వేదిక వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేద పండితులు శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో ఆశ్రమంలో 108 దంపతులతో గీతాయజ్ఞం నిర్వహించారు. గురువులు జగదీశ్వరానంద స్వామి, నారాయణ నందగిరి స్వామి, సదాశివానంద స్వామి, అబేదానంద స్వామి, శివరాం స్వామిలు ఆశ్రమంలు భక్తులకు ప్రవచనాలను బోధించారు.

రక్తదాన శిబిరం

కెరమెరి: మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్లో గురువారం మాజీ వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం జన్మదినం సందర్భంగా, కలాం యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 30 మంది పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ధ్రువీకరణ పత్రం అందజేశారు.

నిజాయతీ చాటుకున్న కండక్టర్

ఆసిఫాబాద్‌అర్బన్: చంద్రాపూర్ నుంచి ఆసిఫాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో బుధవారం ప్రయాణం చేసి, బస్సులో లాప్‌టాప్, మొబైల్ ఫోన్‌ను మర్చిపోయి బస్సును దిగిన జాడే శ్రుతికి తిరిగి తన వస్తువులను అప్పగించి పట్టణానికి చెందిన ఆర్టీసి కండక్టర్ గుండా శ్రీనివాస్ తన నిజాయతీని చాటుకున్నాడు. ఈ విషయాన్ని డిపో మేనేజర్ విశ్వనాథకు సమాచారం ఇచ్చారు. ఇట్టి విషయంపై జాడి శ్రుతి డిపోలో ఫిర్యాదు చేయగా, తిరిగి ఆమెకు మహారాష్ట్రలోని రాజురా డిపో బస్‌స్టేషన్ నందు కండక్టర్ శ్రీనివాస్ శ్రుతి సోదరుడు శ్రీకాంత్‌కు లాప్‌టాప్, మొబైల్ ఫోన్‌లను అందజేశారు.

నూతన కార్యవర్గం

చింతలమానెపల్లి: మండల టీఎస్ యూటీఎఫ్ కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా బుర్రా మహేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా విఘ్నేష్, ఉపాధ్యక్షుడిగా రాకేశ్, శ్రీదేవి, కోశాధికారి రవి కుమార్, కార్యదర్శులుగా రాజన్న, విశ్వనాథ్, సచిన్, పార్వతి, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావు వ్యవహరించారు.

కౌటాల: మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రావుల వినోద్, ప్రధాన కార్యదర్శిగా గుణకర్, ఉపాధ్యక్షుడిగా కృష్ణ, మహిళ ఉపాధ్యక్షుడిగా శిరీష, కోశాధికారిగా రావుజీ, కార్యదర్శులుగా కృష్ణమూర్తి, కృష్ణ, రాకేశ్, ప్రవళిక, ఆడిట్ కమిటీ కన్వీనర్లుగా తిరుపతి, చంద్రమౌళి, మహిళా కన్వీనర్లుగా కల్పన, కళావతి, అకాడమిక్ కమిటీ కన్వీనర్లుగా విలాస్, విఠల్, సోషల్ మీడియా కమిటీ కన్వీనర్‌గా ప్రశాంత్‌లను ఎన్నుకున్నారు.

జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య



రాస్తారోకో చేస్తున్న జర్నలిస్టులు

ఆసిఫాబాద్‌అర్బన్: జర్నలిస్టులపై సినీ నటుడు మోహన్‌బాబు దాడికి దిగడం హేయమైన చర్య అని మాజీ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రజా సంఘాల నాయకులు నిరసనకు మద్దతు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దాడులు పెరిగాయని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి జర్నలిస్టులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. దాడిపై ప్రభుత్వం విచారణ జరిపించి మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు రేగుంట కేశవ్‌రావ్, రూప్‌నార్ రమేశ్, దుర్గం దినకర్, కార్తీక్, నారాయణ, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

యశ్వంత్‌రావు అంబేడ్కర్ జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

వాంకిడి: మండలంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో బీఆర్ అంబేడ్కర్ కుమారుడు యశ్వంత్‌రావు అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతీయ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ మాట్లాడుతూ 1912లో జన్మించిన ఆయన దేశంలోని దళితుల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, అంబేడ్కర్ వారసత్వాన్ని, ఆశయాలను కొనసాగిస్తూ భారతీయ బౌద్ధ మహాసభ జాతీయ అధ్యక్షుడిగా కొనసాగారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బౌద్ధ సమాజ్ వాంకిడి అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మహేశ్, శ్యాంరావు, రోషన్, అరుణ్, ప్రతాప్, రమేశ్, శివాజీ, దుర్గం ప్రశాంత్ పాల్గొన్నారు.

నాన్ ఏజెన్సీ గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కౌటాల: కౌటాల మండలంలోని యాపలగూడ, కోయగూడ గ్రామాలను నాన్ ఏజెన్సీ గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కోట ప్రసాద్‌కు యాలపగూడ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం గురుడుపేట గ్రామ పంచాయతీ నుంచి యాపలగూడ, కోయగూడ గ్రామాలను కలిపి కొత్త గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలన్నారు. యాపలగూడలో దాదాపుగా 400 ఎస్సీ ఓట్లు ఉన్నాయని, కోయగూడలో దాదాపుగా 200 ఎస్టీ ఓట్లు ఉన్నాయన్నారు. నూతన గ్రామ పంచాయతీని ఏజెన్సీ గ్రామ పంచాయతీగా కాకుండా జనరల్ గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామ పెద్దలు విశ్వనాథ్, శంకరయ్య, ప్రశాంత్, విజయ్‌రావు, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బాలకిషన్‌రావు

కౌటాల: చిన్నారులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాల కిషన్‌రావు అన్నారు. గురువారం కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తుండాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నామని, రానున్న వార్షిక పరీక్షల నేపథ్యంలో విద్యార్థులను క్రమం తప్పకుండా కళాశాలకు పంపించాలన్నారు. సమావేశంలో అధ్యాపకులు అశోక్, శ్రీనివాస్ నాయక్, రంజిత్, పాపయ్య, రవీందర్, రాందాస్, రాంబాబు, భాగ్యలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో, నాయకులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండలంలోని వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సత్యనారాయణ మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం మండలంలోని గ్రామాల్లో వార్డుల వారీగా పోలింగ్ బూత్‌లు, ఓటరు జాబితా ప్రదర్శించడం జరిగిందన్నారు. నాయకులు ఎలాంటి అభ్యంతరం ఉన్నా.. తెలియజేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సోహెలె అహ్మద్, అబ్దుల్ అఖిల్, ఎల్ములే శంకర్, ఇఫాత్ హుస్సేన్, తిరుపతి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీవో

దహెగాం: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎంపీడీవో రాజేందర్ అన్నారు. గురువారం మండలంలోని కల్వాడ గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో సీఎం కప్ మండలస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల నైపుణ్యంను వెలికి తీసేందుకు ప్రభుత్వం సీఎం కప్ పోటీలు నిర్వహిస్తుందన్నారు. పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చాటాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని ఓటమి చెందిన వారు నిరాశ చెందవద్దన్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఖోఖో పోటీల్లో రాంపూర్, కల్వాడ జట్లు తలపడగా రాంపూర్ జట్టు విజేతగా నిలిచింది. వాలీబాల్‌లో కల్వాడ, కుంచవెల్లి జట్లు తలపడగా కల్వాడ జట్టు విజేతగా నిలిచింది. కబడ్డీ పోటీల్లో రాంపూర్, కల్వాడ జట్లు తలపడగా, మహిళా విభాగం కబడ్డీ, ఖోఖోలో దహెగాం పెసరికుంట జట్లు తలపడగా.. దహెగాం జట్లు విజేతగా నిలిచాయి. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఈజీఎస్ ఏపీవో కల్పన, పీఈటీలు రవి, రాజమల్లు, బాబు సింగ్, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత

కౌటాల: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత ఉంటుందని ఎంపీడీవో కోత ప్రసాద్ అన్నారు. సీఎం కప్ మండలస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడకారులకు గురువారం కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో గావుడే హన్మంతు, ఎంపీవో మహేందర్‌రెడ్డి, జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ డోంగ్రీ ప్రవీణ్‌కుమార్, హెచ్ఎం నారాయణ్‌సింగ్, పీడీలు హరికృష్ణ, వాణి, రమేశ్ పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అధికారులు

లింగాపూర్: సిర్పూర్ (యూ) మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సీఎం కప్ క్రీడ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణారావు, తహసీల్దార్ రాజేంద్రప్రసాద్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, ఎస్సై రామకృష్ణ, గంగన్నతో, ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలన్నీ బూటకమే

- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలన్నీ బూటకమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్ అన్నారు. మండలంలోని నంబాలలో గురువారం పోలింగ్ బూత్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు, 66 మోసాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను అధోగతి పాలు చేస్తోందని మండిపడ్డారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మినహా మరే ఇతర హామీని అమలు చేయకుండా మాటలతో మభ్య పెడుతోందన్నారు. రాష్ట్రంలోని 50శాతం రైతులకు ఇంకా రుణమాఫీ జరగలేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు గులాం చక్రపాణి, మండల ప్రధాన కార్యదర్శి నవీన్, పోలింగ్ బూత్ అధ్యక్షుడు బక్క ఆనంద్, నాయకులు శాంతయ్య, సత్యనారాయణగౌడ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతుకు పరిహారం అందజేత



చెక్కు అందిస్తున్న అధికారులు

వాంకిడి: ఇటీవల పులిదాడిలో ఆవు మృతి చెందగా, బాధిత రైతుకు అటవీశాఖ అధికారులు గురువారం పరిహారం అందజేశారు. మండలంలోని బండకాస గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆవుల మందపై పెద్దపులి దాడి చేసి ఐదు పశువులను గాయపర్చిన విషయం తెలిసిందే. ఇందులో సోయం బాపురావుకు చెందిన ఆవుకు తీవ్రగాయాలు కాగా కొద్దిరోజుల తర్వాత మృతి చెందింది. అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించగా రూ.20 వేల పరిహారం మంజూరైంది. ఎఫ్ఆర్వో గోవింద్‌సింగ్ సర్దార్ ఆదేశాల మేరకు బాధిత రైతుకు గ్రామస్తుల సమక్షంలో పరిహారం చెక్కు అందజేసినట్లు డీఆర్వో సరోజరాణి తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవో నాగేందర్, గ్రామస్తులు జంగు, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.




కుక్కల స్వైర విహారం

కౌటాల మండల కేంద్రంలో చికెన్ సెంటర్ల నిర్వాహకులు కోళ్ల వ్యర్థాలను రోడ్డు పక్కన పడేయడంతో వాటి కోసం కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. అంతేకాకుండా వృద్ధులను, చిన్నారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. అలాగే రోడ్డుపై సంచరించడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

– కౌటాల

విద్యార్థినులకు అవగాహన సదస్సు



మాట్లాడుతుతున్న ఎస్సై కొమురయ్య

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పెంచికల్‌పేట్ ఎస్సై కొమురయ్య ఆధ్వర్యంలో గురువారం విద్యార్థినులకు సైబర్ నేరాలు, రోడ్డు నిబంధనలు, నూతన చట్టాలు, ట్రాఫిక్ నియమాలు, బాల్య వివాహాలు, చెడు వ్యవసనాల వలన కలిగే అనర్థాలపైన అవగాహన కల్పించారు. విపత్కర పరిస్థితుల్లో అనుసరించాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఉన్నత చదువులు చదివి మంచి పేరును తీసుకుని రావాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.